ప్రమాదాల నివారణకు ఇంధన సంస్థల మాక్‌డ్రిల్

• ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలన

కేసారం శివారులో మాక్ డ్రిల్‌లో భాగంగా గ్యాస్ పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 20 : పెట్రోలియం, గ్యాస్ పైప్‌లైన్ నిర్వహణ, ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ప్రముఖ ఇంధన సంస్థలు హిందుస్థాన్ పెట్రోలియం, గెయిల్ ఇండియా లిమిటెడ్, పీఐఎల్ పెట్రోలియం సంస్థల ఆధ్వర్యంలో మండలంలోని కేసారం గ్రామ శివారు ప్రాంతంలో మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలించి మాట్లాడారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు పనుల కోసం పైప్‌లైన్ వెళ్లే మార్గంలో తవ్వకాలు జరిపేటప్పుడు, బోర్లు, డ్రిల్లింగ్ వేసేటప్పుడు ఆయా సంస్థలకు సమాచారం అందించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

కోదాడ అభివృద్ధికి నిధులు మంజూరు

• హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమీక్ష

కోదాడ మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, ఫిబ్రవరి 20 : కోదాడ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. పట్టణ అభివృద్ధి పనులపై మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులతో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి మంగళవారం హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ పురపాలక సంఘంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్‌ఐడీసీ) ద్వారా రూ.20 కోట్లు, అమృత్ పథకం ద్వారా మంచి నీటి సరఫరాకు రూ.25 కోట్లు, శ్రీరంగాపురం, బాలాజీనగర్ నందు రెండు అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్లు నిర్మించేందుకు రూ.2.86 కోట్లు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. ఈ నెల 23న మంజూరైన నిధులకు చేపట్టాల్సిన పనులకు సంబంధించిన శంకుస్థాపన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధికి అవసరమైనన్నీ నిధులు మంజూరు చేయిస్తామని మంచి ప్రణాళికతో అభివృద్ధి చేయాలని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కమిషనర్ రమాదేవి, పబ్లిక్ హెల్త్ డీఈఈ రమాదేవి పాల్గొన్నారు.

ఆధార్ ఫీడింగ్ త్వరగా చేపట్టాలి

• డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 20 : ఆధార్ ఫీడింగ్ త్వరగా చేపట్టి కూలీలకు వేతనాలు అందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి.మధుసూదన్ రాజు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ 14వ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి గాను కూలీలకు రూ 4,72, 51164, మెటీరియల్‌కు రూ.12,56,68 ఖర్చు చేయడం జరిగిందన్నారు. మస్టర్‌లో మేట్ల పొరపాటు వల్ల దిద్దుబాటు జరిగిందని వాటిని సరి చూడాలన్నారు. ప్లాంటేషన్‌కు సంబంధించిన కొన్ని మొక్కలు చనిపోయినట్లుగా గుర్తించగా వాటి స్థానంలో తిరిగి మొక్కలు నాటాలన్నారు. మండలం మొత్తం రూ.1,43,878 రికవరీ చేయడానికి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ డి.లచ్చిరాంనాయక్, విజిలెన్స్ అధికారి ఆశారాణి, ఎస్‌ఆర్పీ రమేశ్, ఏపీఓ ఈశ్వర్, ఈసీలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

• ఎంపీపీ పద్మాసైదేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మాసైదేశ్వర్‌రావు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 20 : రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శాగంరెడ్డి పద్మాగోవిందరెడ్డి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు సిద్ధం కావాలి

• ప్రత్యేక అధికారి జగదీశ్వర్‌రెడ్డి

మునగాల : సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

చివ్వెంల, ఫిబ్రవరి 20 : త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్, పదోతరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని చివ్వెంల మండల ప్రత్యేక అధికారి కె.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సంయుక్త సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎంఈఓ కె.గోపాల్‌రావు, ఎంపీఓ గోపి, హెచ్‌ఎం కళారాణి, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ విజయసారధి, వివిధ శాఖల అధికారులు యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, శిరోమణి, భిక్షమమ్మ, కోటిరెడ్డి, రజిని, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

మునగాల : పది, ఇంటర్ పరీక్షల నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతూ పరీక్షలు నిర్వహించాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సలీంషరీఫ్, వైద్యాధికారి శ్రీశైలం, తాసీల్దార్ ఆంజనేయులు, హెచ్‌ఎం సీతారామరాజు, ఎంపీఓ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్ : పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో కలసి ఎంపీడీఓ కార్యాలయలో ఎంఈఓ పి.దారాసింగ్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో నిర్వహించే పరీక్ష కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ హసీం, ఏఎస్‌ఐ దస్తగిరి, రెవెన్యూ కార్యాలయ సూపరింటెండెంట్ ఇంద్రకుమార్, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డి, ప్రసాద్‌స్వామి, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనంతగిరి : పదో తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని తాసీల్దార్ రవికుమార్ అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

'దళితులకు కేటాయించిన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలి'

తమ్మర ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుత్వ భూమి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20 : పట్టణ పరిధి తమ్మర ఎస్సీ కాలనీకి చెందిన దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమికి అధికారులు హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణను అడ్డుకోవాలని కాలనీ వాసులు కోరారు. తమ్మరబండపాలెం గ్రామ 2వ వార్డు ఎస్సీ కాలనీ వాసుల గృహ నిర్మాణం కోసం 1984లో ప్రభుత్వం గ్రామానికి చెందిన కనగాల నరసింహయ్యకు చెందిన సర్వే నంబర్ 446/అ3లోని ఎ.4-30 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అందులోని సగ భాగంలో దళితులు నివాస గృహాలను నిర్మించుకుని మిగిలి భూమిని రోజువారి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కాలక్రమేణ కోదాడ భారీగా విస్తరించడంతో తమ్మర పంచాయతీని పట్టణంలో కలిపారు. ఈ నేపథ్యంలో తమ్మర గ్రామ భూములకు విపరీతంగా ధరలు పెరిగాయి. దాంతో గ్రామానికి చెందిన కొంత మంది పెద్దలు కాలనీ భూమిని పూర్తిగా అమ్మలేదు, మిగులు భూమి తమకే చెందుతుందని పేర్కొంటూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక, డివిజన్ రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితుల భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విశ్రాంత అధ్యాపకుడు కృష్ణయ్య మృతి

కృష్ణయ్య

నేరేడుచర్ల, ఫిబ్రవరి 20 : నేరేడుచర్ల పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, కేఎన్‌ఎం కళాశాల విశ్రాంత అధ్యాపకుడు పానుగంటి కృష్ణయ్య (63) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. మృతదేహాన్ని పలువురు పుర ప్రముఖులు, పాత్రికేయులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

అర్వపల్లి : సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని కాసర్లపహాడ్ గ్రామంలో ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు శిగ నసీర్ పాల్గొన్నారు.

కూచిపూడి గ్రామంలో..

కోదాడ రూరల్ : మండలంలోని కూచిపూడి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులకు ఎంపీపీ మల్లెల రాణి, జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, అనంత రామయ్య, శెట్టి విజయభాస్కర్, శిరంశెట్టి బాబూరావు, చాప తిరుపతయ్య, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి పాల్గొన్నారు.

త్రికూటేశ్వర ఆలయ శివరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20 : మండలంలోని నాగులపహాడ్ త్రికూటేశ్వర ఆలయం మహాశివరాత్రి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తుల సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా సంకరమద్ది సుధీర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా సంకరమద్ది దామోదర్‌రెడ్డి, సంకరమద్ది నిరంజన్‌రెడ్డి, రేఖ ఇంద్రయ్య, సంకరమద్ది శ్రవణ్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా కొండ జానకిరాములు, నారాయణ, కృష్ణారెడ్డి, రాయలి శ్రీను, ఉపాధ్యక్షులుగా ఒగ్గు దేవయ్య, సంకరమద్ది పుల్లారెడ్డి, పాగుల జానయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏపూరి నగేశ్, కోశాధికారిగా ఎద్దుల రామిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా నంద్యాల హరీశ్‌రెడ్డి, కుర్రి శ్రీను, కందుకూరి నరేశ్, మీసాల నాగయ్యను ఎన్నుకున్నారు.

చెట్టును ఢీకొన్న పోలీస్ కారు

గరిడేపల్లి ఎస్‌ఐకి గాయాలు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20 : గరిడేపల్లి మండల ఎస్‌ఐ సైదులుకు ప్రమాదం తప్పింది. మంగళవారం తెల్లవారుజామున సొంతగా కారు డ్రైవ్ చేస్తూ సూర్యాపేటలోని తన ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పి రహదారి వెంట ఉన్న చెట్టును ఢీకొట్టింది. దాంతో ఎస్‌ఐ ఎడమ చేయి విరిగింది. చికిత్స కోసం స్థానికులు 108 వాహనం ద్వారా సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్య మహిళకు విశేష స్పందన

నూతనకల్, ఫిబ్రవరి 20 : ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి ఆయా గ్రామాల మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 22 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 9 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించారు.

ఆర్థిక సాయం

తుంగతుర్తి, ఫిబ్రవరి 20 : మండల కేంద్రానికి చెందిన రామడుగు లక్ష్మమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి 100 కిలోల బియ్యం, 15 కిలోల నూనె డబ్బాను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, కటకం వెంకటేశ్వర్లు, బత్తుల జలేందర్, అక్కినపల్లి రాములు, బొంకూరి రంజిత్, శివాజీ, నాగయ్య, ఉల్లెందుల వెంకన్న పాల్గొన్నారు.

రాఘవాపురం ఎక్స్ రోడ్డులో తెగిపడ్డ విద్యుత్ వైర్లు

మోతె, ఫిబ్రవరి 20 : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డులో సిరికొండ వైపు వెళ్లే రహదారి వెంబడి ఉన్న విద్యుత్ వైర్లు తెగి ద్విచక్ర వాహనంపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ వైర్లు కాలి తెగిపడినట్లు గ్రామస్తులు తెలిపారు.

27న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20 : ఈ నెల 27న జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఉపకులల అధ్వర్యంలో నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కోదాడ మండలాధ్యక్షుడు నారకట్ల ప్రసాద్ అన్నారు. మంగళవారం దొరకుంటలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

కోదాడ టౌన్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుండే స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ఆకు పూజ, పుష్పాలంకరణ వంటి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం దాతల సహాయంతో అన్నదానం చేపట్టారు.

నేటి నుంచి కందిబండలో చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 20 : మండలంలోని కందిబండ గ్రామంలో కొలువైన భూనీలస హిత చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ 25 వరకు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పొనగండ్ల రామిరెడ్డి మంగళవారం తెలిపారు. సుమారు 400 ఏండ్ల క్రితం ప్రతిష్ఠించిన స్వామివారికి ప్రతి ఏటా మాఘమాసంలో కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతాయని చెప్పారు. ఈ 24న రాత్రి స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎద్దుల పందేలు, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

• ఎంపీడీఓ పవన్‌కుమార్

చింతలపాలెం, ఫిబ్రవరి 20 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ టి.పవన్ కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాలని సూచించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓను పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌జీఎస్, కార్యాలయ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు.

పీఎం కిసాన్ యోజనకు ఈ కేవైసీ చేయించాలి

• ఏఓ మురళిబాబు

నూతనకల్, ఫిబ్రవరి 20 : ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకానికి సంబంధించి ప్రతి ఏడాది రైతు పెట్టుబడి సాయం అందుకునేందుకు రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళిబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు తమ ఆధార్‌ను బ్యాంక్ ఖాతాకు లింక్ చేయించుకోవాలని సూచించారు. ఈ కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 22 వరకు అవకాశం ఉన్నదని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీవేశంలో ఏఈఓలు జానయ్య, శ్రావణి పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను ప్రభుత్వం కాపాడాలి

• బీఆర్‌ఎస్ నాయకులు

కల్మల్‌చెర్వులో ఎండిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 20 : ఎండుతున్న వరి పంట పొలాలకు ప్రభుత్వం సాగర్ నీటిని విడుదల చేసి కాపాడాలని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామంలో ఎండుతున్న వరి పొలాలను మంగళవారం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించి మాట్లాడారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారని కోతకొచ్చిన సమయంలో నీరు లేకపోవడంతో అవి ఎండిపోతున్నట్లు తెలిపారు. రైతులు ఇంత బాధపడుతున్నా ప్రభుత్వం సాగర్ నీటిని విడుదల చేయకుండా చోద్యం చూడడం దారుణమన్నారు. అలాగే సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ మండలంలోని లక్ష్మీపురం, సుభాశ్‌నగర్‌లో ఎండుతున్న పొలాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, నాయకులు గుత్తికొండ వెంకటరమణారెడ్డి, పోతురాజు చంద్రయ్య, గ్రామాధ్యక్షుడు ఎల్గూరి సత్యనారాయణరెడ్డి, హుస్సేన్, లతీఫ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గాజుల మల్కాపురం సమ్మక్క-సారలమ్మ జాతర

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20 : మండలంలోని గాజుల మల్కాపురం గ్రామంలో కొలువైన సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమై 24 వరకు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. నేడు సమ్మక్క సారలమ్మ విగ్రహాలను ఆలయ పూజారి కృష్ణంరాజు ఇంటి నుంచి భక్తజన సందోహం నడుమ కోలాటాలు, భజనలు, బ్యాండ్ మేళాలతో గ్రామ శివారులో ఉన్న గిన్నె చెట్టు వద్ద వెలసిన గద్దెపై ప్రతిష్ఠంపజేస్తారు. జాతర సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు తెలిపారు.

సర్ఫరాజ్ షేక్‌కు ఓయూ డాక్టరేట్

సర్ఫరాజ్ షేక్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20 : సూర్యాపేట జిల్లా నడిగూడెం గ్రామానికి చెందిన సర్ఫరాజ్ షేక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రేరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వి. చంద్రశేఖర రావు పర్యవేక్షణలో 'స్టేటస్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషనల్ రిపాజిటరీస్ డెవలప్‌డ్ బై స్పెషల్ లైబ్రరీస్ ఇన్ ఇండియా: యాన్ ఎక్స్‌ప్లొరేటరీ స్టడీ'అనే అంశంపై పరిశోధనకు గాను సర్ఫరాజ్ ఓయూ డాక్టరేట్ అందుకున్నాడు. ప్రస్తుతం ఆయన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం క్యాంపస్‌లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌లో లైబ్రేరియన్‌గా పని చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

• ఏఈ శ్రీనివాస్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని తెలగరామయ్యగూడెంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గుడుగుంట్లపాలెం శివాలయ నూతన కమిటీ

ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు, ఫిబ్రవరి 20 : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గల పార్వతీరామలింగేశ్వరాలయ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బూశిపల్లి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్‌గా శ్రీకాకుళ సైదాచారీ, కార్యవర్గ సభ్యులుగా కిష్టిపాటి వెంకటరెడ్డి, సారెడ్డి సీతారాంరెడ్డి, సారెడ్డి లచ్చిరెడ్డి, కిష్టిపాటి అంజిరెడ్డి, ఆదిరెడ్డి రాఘవరెడ్డి, సారెడ్డి లచ్చిరెడ్డి, పుట్లూరి నర్సిరెడ్డి, దిద్దకుంట్ల నర్సిరెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్‌ను ఎంపీపీ గోపాల్, పూజారి గిరిజాప్రసాద్ శాలువాతో సన్మానించారు.

వృత్తి విద్యకు మంచి భవిష్యత్ : డీఐఈఓ కృష్ణయ్య

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 20 : వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉన్నదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కృష్ణయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన లక్ష్మీవెంకటసాయి ఓకేషనల్ కళాశాల 5వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకేషనల్ విద్య ద్వారా స్వతహాగా జీవనోపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ పరమైన ఉద్యోగాలు త్వరగా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి మార్కులు పొందిన కళాశాల విద్యార్థులను మెమోంటో, మెడల్స్‌లో సత్కరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, కరస్పాండెంట్ కారింగుల బాలాగౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో కోదాడ శ్రీస్కూల్ విద్యార్థుల ప్రతిభ

• మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో ర్యాంకులు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 20 : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఎస్‌ఆర్‌ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 19న నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో కోదాడ పట్టణానికి చెందిన శ్రీ ఎలైట్ పాఠశాల విద్యార్థులు 12 మంది ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేదాంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని చౌటపల్లి గ్రామంలో కొలువై ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 25 వరకు కొనసాగనున్నట్లు ఆలయ చైర్మన్, ఇన్‌చార్జి ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు మంగళవారం తెలిపారు. 21న ప్రత్యేక పూజలు, 22న నిత్య హోమం, 24న స్వామి వారిని పెండ్లి కొడుకు చేయుట, మహా పూర్ణాహుతి, కోలాట భజనలు, 25న రథంలో ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీపై చర్యలు తీసుకోవాలి'

చిలుకూరు, ఫిబ్రవరి 20 : నకిలీ విత్తనాలు అంటగట్టి తమకు తీవ్ర నష్టం చేకూర్చిన కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్ట పరిహారం అందివ్వాలని చిలుకూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. సదరు కంపెనీపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు మండల వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కృషి విజాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీధర్, చంద్రశేఖర్, వ్యవసాయాధికారులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. బాధిత రైతులు మట్లాడుతూ నాటు వేసిన నెల రోజుల్లోలోపే వరి పొలం ఈత దశకు వచ్చిందని దాంతో పంటకు నష్టం వాటిల్లిందని వాపోయారు. పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వరి విత్తనాలను సరఫరా చేసిన చరన్ సోనామ్ సీడ్స్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

గంజాయి పట్టివేత

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20 : కోదాడ పట్టణంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన విస్తృత తనిఖీల్లో గంజాయి పట్టుబడిన్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శంకర్ మంగళవారం తెలిపారు. పట్టణ పరిధి కోమరబండ శివారులోని బొబ్బలమ్మగుట్ట, ఖమ్మం క్రాస్ రోడ్డు, సూర్యాపేట రోడ్డు సినిమా థియేటర్ సమీపంలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో కిలో గంజాయి కలిగిన ఆరుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐలు యాదగిరి, రామకృష్ణ, గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలో దక్కన్ సిమెంట్స్ యాజమాన్యంపై కేసు నమోదు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20 : హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ కోర్టు ఆదేశానుసారం దక్కన్ సిమెంట్స్ ఎండీ బంగారురాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వర్‌రావుతో పాటు మరో 9 మందిపై పాలకవీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుల తరపు న్యాయవాది శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన కల్లేటి వెంకయ్యకు అప్పటి ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించింది. ఆయన దానిని సాగు చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. అక్కడికి సమీపంలో ఉన్న దక్కన్ సిమెంట్స్ ఫ్యాక్టరీ వారు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దాంతో బాధితుడు పలుమార్లు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించగా పరిశీలించిన న్యాయస్థానం కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

జాతీయ పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

తిరుమలగిరి, ఫిబ్రవరి 20 : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ వందన అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన పోలియో అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలకు ఆమె అవగాహన కల్పించి మాట్లాడారు. మార్చి 3 న జాతీయ పల్స్ పోలియో దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేండ్ల పిల్లలకు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలని పేర్కొన్నారు. ఎంపీపీ స్నేహలత, ఎస్‌ఐ సత్యనారాయణ, ఎంఈఓ శాంతయ్య, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, ఖదీర్ పాల్గొన్నారు.